బీఆర్‌ఎస్‌ సభను విజయవంతం చేయాలి

రాయదుర్గం: బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌ శేరిలింగంపల్లి సీనియర్‌ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా కోరారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలో సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో చలో వరంగల్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

సగర సంఘం కార్యాలయం ప్రారంభం



దినేష్‌చౌదరిని సత్కరిస్తున్న సంఘం నాయకులు

రాయదుర్గం: సగర సంఘానికి అండగా ఉంటామని బీఆర్‌ఎస్‌ పార్టీ అధికార ప్రతినిధి, సోషల్‌ మీడియా రాష్ట్ర కన్వీనర్‌ దినేష్‌చౌదరి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ రాయదుర్గంలో ఆదివారం సగర సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సంఘటితంగా ముందుకుసాగాలన్నారు. అనంతరం కార్యాలయానికి అవసరమైన వసతులతోపాటు ఫర్నీచర్‌ అందించిన వారిని సత్కరించి షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో రాయదుర్గం సగర సంఘం అధ్యక్షుడు బాలరాజుసాగర్‌, ఉపాధ్యక్షుడు డిండి పరంధాములు, రాము, నవీన్‌, శాంతన్‌, సాయి వేణు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన అసోసియేషన్‌ అధ్యక్షులు షేక్‌ ఖాసీం, ప్రతినిధులు

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌పార్కు కాలనీ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని పీఏసీ చైర్మన్‌ గాంధీ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీ అసోసియేషన్‌ నాయకులు ఆదివారం గాంధీని ఆయన నివాసంలో కలిసి కాలనీలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తి రోడ్లను పూర్తి చేయిస్తానన్నారు. త్వరలో కాలనీలో పర్యటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌, గుల్‌మొహర్‌పార్కు కాలనీ అధ్యక్షులు షేక్‌ ఖాసీం, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్‌, ప్రతినిధులు నాగన్న, విల్సన్‌, కుమార్‌, గంగిశెట్టి, శ్రీనివాస్‌, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, కిరణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిబిరం

ఆల్విన్‌కాలనీ: భారతీయ యోగా సంస్థాన్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పరిధి హైదర్‌నగర్‌ డివిజన్‌ ఆదిత్యనగర్‌ కమిటీ హాలులో ఆదివారం ఉచిత యోగా సాధన శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జీవా గురుకులం, సమతానగర్‌ ప్రిన్సిపల్‌ కె. ఉమావతి, అతిథులుగా డా. శేషగిరిరావు, ఆదిత్యనగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు కె. వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కె.రాంబాబు, భారతీయ యోగా సంస్థాన్‌ సెక్రటరి కె. జ్యోతి, సెంటర్‌ ఇన్‌చార్జి డి. వసుంధరాదేవి పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శేరిలింగంపల్లి: హాఫీజ్‌పేట్‌ లేబర్‌ అడ్డాలో తెలంగాణ బిల్డింగ్‌ కన్‌స్ట్రక్షన్స్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న మహాసభల పోస్టర్‌ను ఏఐటీయూసీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు తుపాకుల రాములు ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగం చాలా కీలకమైందని, ఇందులో 10 కోట్ల మంది పనిచేస్తున్నారన్నారు. ఈ నెల 21 తేదీన జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండయ్య, తిరుపతయ్య, వెంకట్‌, శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు!

- వందలాది ఎకరాల ప్రభుత్వ భూములున్నా ఫలితం లేదు
- అద్దె కడుతున్న ఎక్సైజ్‌, సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాలు
- ఫుట్‌పాత్‌ పైనే గచ్చిబౌలి ట్రాఫిక్‌ పీఎస్‌
- ప్రభుత్వ కార్యాలయాలకు స్థల కేటాయింపు ఊసే లేదు
- దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల వేలం.. ఇవే రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరులు



చందానగర్‌లో అద్దె భవనంలో శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ ఆఫీస్‌

గచ్చిబౌలి: రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం ఆశ్చర్యకరం. ప్రభుత్వ ఖజానాకు అత్యధికంగా ఆదాయం సమకూరుస్తున్న శేరిలింగంపల్లి సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం, ఎక్సైజ్‌ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడం గమనార్హం. ఈ నియోజకవర్గంలో దాదాపు ఎనిమిదిన్నర లక్షల జనాభా ఉంది. ఓటర్లు దాదాపుగా ఏడు లక్షలకు చేరువలో ఉన్నారు. ఐటీ కారిడార్‌లో అత్యంత ట్రాఫిక్‌ రద్దీ ఉండే ప్రాంతాల్లో గచ్చిబౌలి ఒకటి. గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ గత మూడేళ్లుగా ఫుట్‌పాత్‌ పైనే కొనసాగుతోంది. అంతేకాకుండా ఇటీవల కొత్తగా ఏర్పడిన కొండాపూర్‌ ఎక్సైజ్‌ కార్యాలయంను అద్దె భవనంలోనే ఏర్పాటు చేశారు. కొండాపూర్‌ ఆర్టీఓ కార్యాలయం వివాదాస్పద స్థలంలోనే కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు, ఆయా విభాగాల అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఉన్నా వేలం వేసి ప్రైవేట్‌ కంపెనీలకు కట్టబెడుతున్నారే తప్ప కార్యాలయాలకు స్థలం కేటాయింపు, సొంత భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు పెరిగే అవకాశం

పెరిగిన జనాభాకు తోడు ఐటీ కారిడార్‌లో నిత్యం ఐటీ, ఐటీయేతర ఉద్యోగులు దాదాపు 10 లక్షల మంది పని చేస్తున్నారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్‌ కమ్యూనిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు పెరుగుతున్నాయి. రాయదుర్గం, మాదాపూర్‌ పీఎస్‌ల నుంచి విడిపోయి నాలుగేళ్ల క్రితం గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ ఏర్పడింది. గతంలో మాదాపూర్‌ ట్రాఫిక్‌ పీఎస్‌ మాత్రమే ఉండేది. ప్రస్తుతం గచ్చిబౌలి, రాయదుర్గం ట్రాఫిక్‌ పీఎస్‌లు ఏర్పడ్డాయి. గచ్చిబౌలి పీఎస్‌ ఫుట్‌పాత్‌పై, రాయదుర్గం పీఎస్‌లో ట్రాఫిక్‌ పీఎస్‌ కొనసాగుతోంది. శేరిలింగంపల్లి సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం నార్సింగి మండలంలోని వట్టినాగులపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతోంది. చందానగర్‌లో దశాబ్దాల తరబడి అద్దె భవనంలో ఎక్సైజ్‌ కార్యాలయం ఉండగా తాజాగా హఫీజ్‌పేట్‌లో అద్దె భవనంలోనే కొండాపూర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కొత్తగా కొండాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ ప్రతిపాదన ఉన్నా స్థలం కేటాయింపు మాత్రం జరగలేదు. ఇక



డీఎల్‌ఎఫ్‌ రోడ్డులో ఫుట్‌పాత్‌పై గచ్చిబౌలి ట్రాఫిక్‌ పీఎస్‌

కొండాపూర్‌ ఆర్టీఏ కార్యాలయంలో ట్రాక్‌ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. కాగా టీజీఐఐసీ, హెచ్‌ఆర్‌డీసీఎల్‌ కార్యాలయాలకు మాత్రం సొంత భవనాలు ఏర్పాటు చేసుకున్నారు.

వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా..

శేరిలింగంపల్లి రెవెన్యూ మండల పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ, ఇండియన్‌ ఇమ్యునోలాజికల్‌, ఆర్‌టీటీసీ, ఉర్దూ యూనివర్సిటీ, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌, టెలికాంనగర్‌, హెచ్‌సీయూ బస్‌ డిపో, ట్రిపుల్‌ ఐటీ, శిల్పారామం, నిథమ్‌, చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీ, సీసీఆర్‌టీ, సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌, గచ్చిబౌలి స్టేడియం, హాకీ స్టేడియం, టీఎఫ్‌ఆర్‌ఐ తదితర సంస్థలకు వేల ఎకరాలు కేటాయించారు. 1996 నుంచి మాదాపూర్‌, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌లో ఐటీ కంపెనీల కోసం వందల ఎకరాలు ఇచ్చారు. అమెరికన్‌ కాన్సులేట్‌, స్టేట్‌ ఎలక్షన్‌ కమిషన్‌, ప్రైవేట్‌ ఆస్పత్రులు, స్టార్‌ హోటల్స్‌, కుల సంఘాలకు స్థల కేటాయింపులు జరిగాయి.

ఇప్పటికీ వందల ఎకరాల ప్రభుత్వ భూములు

శేరిలింగంపల్లి మండల పరిధిలో ఇప్పటికీ వందల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. గోపన్‌పల్లి సర్వే నంబర్‌ 36, 37, ఖాజాగూడ సర్వే నంబర్‌ 27, గచ్చిబౌలి సర్వే నంబర్‌ 91, నానక్‌రాంగూడ సర్వే నంబర్‌ 74, రాయదుర్గం నవకల్సా సర్వే నంబర్‌ 63/3 , రాయదుర్గం పాన్‌ మక్తా సర్వే నంబర్‌ 46, మియాపూర్‌ సర్వే నంబర్‌ 100తో అనేక చోట్ల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ భూములపై లొసుగులతో ప్రైవేట్‌ వ్యక్తులు లేని పత్రాలు సృష్టించి విలువైన భూములను వివాదంగా మార్చారు. శేరిలింగంపల్లిలో ఇప్పటికీ భవిష్యత్‌ తరాల అవసరాలకు భూములు ఉన్నాయి.

స్థలం కేటాయించాలి

శేరిలింగంపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల కేటాయింపు చేస్తే భవిష్యత్‌లో సొంత భవనాల నిర్మాణం చేసుకునేందుకు వీలుంటుంది. ప్రభుత్వ కార్యాలయాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా కాంప్లెక్స్‌ నిర్మాణం చేపడితే అన్ని కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేయవచ్చు. ప్రజలకు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థ కొంతమేర తప్పే అవకాశం ఉంటుంది.

నాట్యశోభితం





మాదాపూర్‌: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పద్మశ్రీ శోభానాయుడు శిష్యబృందం నాట్యశోభితం నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పీవీ కృష్ణభారతి, బసవ లావణ్య, ఉషాకిరణ్‌, ఉషా గోటేటి గురువుల శిష్యబృందాలు పాల్గొన్నారు. ప్రముఖ నాట్య గురువులు పద్మశ్రీ పద్మజారెడ్డి, డాక్టర్‌ రమాదేవి కళాకారులను అభినందించారు. శ్వేతాప్రసాద్‌, జయకుమార ఆచార్యలను సురభి రఘునాథ్‌ సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం



మియాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకుడు రవికుమార్‌యాదవ్‌

మియాపూర్‌: సామాజిక బాధ్యతగా అవసరం ఉన్నచోట ప్రతి ఒక్కరు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ అన్నారు. మియాపూర్‌లో ఆదివారం బీజేపి సీనియర్‌ నాయకులు ఆర్‌కేవైటీ అధ్యక్షులు గుండె గణేశ్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నాయకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగుల్‌గౌడ్‌, లక్ష్మణ్‌ ముదిరాజ్‌, మనోహర్‌, మాణిక్‌రావు, రాజేశ్‌, శ్రీనివాస్‌, జితేందర్‌, శివరాజ్‌, ప్రసాద్‌, రాము, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లన్న గంపలు తీయటం, మల్లన్న కొట్నం, గొలుసు తెంపుట, బోనాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బస్సులో బంగారు నగల హ్యాండ్‌బ్యాగ్‌ మాయం

శేరిలింగంపల్లి: ప్రైవేట్‌ బస్సులో బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ పోయిన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. చందానగర్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ షహీన (65) నార్సింగి నివాసి. శనివారం రాత్రి కర్ణాటక హుబ్లీ నుంచి ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సులో కొడుకుతో హైదరాబాద్‌కు వచ్చింది. ఆదివారం ఉదయం 9 గంటలకు చందానగర్‌ వద్దకు రాగానే బ్యాగ్‌ కోసం చూడగా కనిపించలేదు. అందులో 12 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయంటూ చందానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి



మణికొండ: పందెన్‌వాగు పరీవాహక ప్రాంత నివాసితులకు దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, బాక్స్‌ డ్రైన్‌ నిర్మించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ట్రయల్స్‌ విల్లాస్‌, పందెన్‌వాగు పరీవాహక ప్రాంతంలో.. గుడ్‌ మార్నింగ్‌ మణికొండ కార్యక్రమంలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పందెన్‌వాగులో నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు పంచవటి కాలనీలోని రోడ్డు నెంబర్‌ 10 వద్ద ఓ చెక్‌ డ్యాంను నిర్మించి మురుగునీటిని గతంలో మాదిరిగా షేక్‌పేట వైపు మళ్లించాలన్నారు. ట్రయల్స్‌ విల్లాస్‌ ముందు పంచవటి కాలనీతో కనెక్ట్‌ చేస్తు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఓయూ కాలనీ రోడ్డులో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డును విస్తరించి సమస్యను పరిష్కరించాలన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌, కిరణ్‌, బాబు, భానుచందర్‌, సుమనళిని, తిరుపతి, గోపి సాగర్‌ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మియాపూర్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌ జేపీయన్‌ కాలనీలో సత్యనారాయణ (62) కుటుంబం నివసిస్తోంది. పని నిమిత్తం శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్ళాడు. స్టాలిన్‌నగర్‌వైపు నుంచి జేపీఎన్‌ నగర్‌వైపు వస్తుండగా ప్రశాంత్‌నగర్‌ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. సత్యనారాయణ కింద పడగా తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అల్లుడు నరేష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దానగుణం కలిగి ఉండాలి

మణికొండ: ప్రతి మనిషిలోనూ దానగుణం ఉండాలని, పేదలకు దానం చేసినపుడే మన జన్మ ధన్యం అవుతుందని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌ బస్‌స్టాప్‌ వద్ద స్థానిక అరుణాచల శివ సేవా సత్సంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని ఆయన మాజీ కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అరుణాచల సేవా సంస్థ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని కొనసాగించాలన్నారు. సత్సంగం ప్రతినిధులు బద్రీనాథ్‌, శ్రీహరి మాట్లాడుతూ... తమ సంస్థ తరఫున ప్రతి వారం మణికొండ నుంచి అరుణాచల యాత్రకు ఏసీ బస్సు వెళ్తుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ లక్ష్మీశ్రీ, నాయకులు సి.బీరప్ప, రాజేశ్‌, శ్రావణ్‌, విజయ్‌రెడ్డి, సత్సంగం సభ్యులు మనోహర్‌, జగదీష్‌, లవకుమార్‌, ధర్మారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్‌: సంపద సృష్టిలో కార్మికుల కష్టం ఎనలేనిదని వారి హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ రాజీ లేని పోరాటం చేస్తుందని అఖిలభారత ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని టీజీఐఐసీ కార్యాలయంలో జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కిర్బీ కార్మికుల జనరల్‌ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్‌ సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో కిర్బీ కార్మికులు ఐఎన్‌టీయూసీకి అవకాశం ఇస్తే వేతన ఒప్పందం, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌, బోనస్‌ ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు రెహమాన్‌, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌, ఐఎల్‌ఓ గవర్నింగ్‌ బాడీ సభ్యులు సత్యజిత్‌ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు జనార్దన్‌ రెడ్డి, రవీందర్‌గౌడ్‌, కొండల్‌ రెడ్డి, కిర్బీ నాయకులు విజయ్‌, రామారావు, పలు పరిశ్రమల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్‌ సెంటర్‌ను ప్రారంభించిన ప్రముఖులు



ఆర్థోపెడిక్‌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్‌ ఎన్‌వీరమణ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ రాయదుర్గం మల్కంచెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఆర్థోపెడిక్‌ సెంటర్‌, సెరమ్‌ లక్స్‌ స్కిన్‌ కేర్‌ సెంటర్లను పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ఎన్‌వీ రమణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌, రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌ రెడ్డి, పీఏసీ చైర్మన్‌ గాంధీ తదితరులు పాల్గొని ఆస్పత్రి నిర్వాహకులను అభినందించారు.

ఆస్తి పన్ను తగ్గించేదాకా పోరాటం



సమావేశంలో పాల్గొన్న ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ సభ్యులు

ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ తీర్మానం

మణికొండ: ముందస్తు నోటీసులు, మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశంలో చర్చించకుండా ఇష్టారాజ్యంగా ఐదు రెట్లు పెంచిన ఆస్తి పన్ను తగ్గించేదాకా అవిశ్రాంత పోరాటం చేయాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌ కాలనీస్‌ రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్స్‌ ఫెడరేషన్‌ తీర్మానించింది. ఆదివారం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో హరివిల్లు అపార్ట్‌మెంట్స్‌ క్లబ్‌ హౌస్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్నుల పెంపుపై ఇప్పటికే కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు... కొత్త వాటి వసూళ్లపై స్టే విధించిందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజావసరాలైన పార్కులు, లింక్‌ రోడ్లు, డ్రైనేజీ, దోమల సమస్య, ప్యాచ్‌ వర్కులు, స్పీడ్‌ బ్రేకర్‌ల ఏర్పాటు లాంటి ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. వేసవిలో బోర్లు వట్టిపోతున్నాయని, జలమండలి అధికారులు రోజురోజుకూ కొత్త బల్క్‌ కనెక్షన్‌లు ఇస్తూ కాలనీలకు నీటి సరఫరా సమయాన్ని తగ్గిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. వేసవిలో కొత్త కనెక్షన్‌లను నిలిపి కాలనీలకు నీటి సమయాన్ని పెంచాలని జలమండలి అధికారులను కోరాలని నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్‌, ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, రాజసింహారెడ్డి, ప్రవీణ, పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లి చిన్నాపెద్ద చెరువులో చేపలు మృత్యువాత



రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్నాపెద్ద చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు చెరువులను సుందరీకరణ, మురుగునీరు చేరకుండా చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటిస్తున్నా, మరోవైపు చేపలు పెద్ద సంఖ్యలో మృతి చెందడం ఆందోళనకు గురిచేస్తోంది. చెరువులోకి మురుగునీరు పెద్ద ఎత్తున చేరుతున్నందునే ఈ సమస్య తలెత్తుతోందని చెరువులోని బ్రిక్స్‌ స్కైవుడ్‌ అపార్ట్‌మెంట్‌కు చెందిన పివిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెరువులోకి మురుగునీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సన్నాహక సమావేశానికి తరలిన మహిళా నాయకులు



ఆల్విన్‌కాలనీ: మే నెలలో జరగబోయే మున్నూరు కాపు సింహగర్జనకు సంబంధించి ఆదివారం జలవిహార్‌లో జరగనున్న సన్నాహక సమావేశానికి జగద్గిరిగుట్ట నుంచి మున్నూరు కాపు మహిళా సంఘం నాయకులు తరలి వెళ్లారు. మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షురాలు పర్వత సంధ్యారాణి పటేల్‌ ఆధ్వర్యంలో సుమారు నాలుగు బస్సుల్లో 200 మంది మహిళలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి మున్నూరు కాపు మహిళా కో కన్వీనర్‌ కొట్టే అరుణ పటేల్‌, వివేకానందనగర్‌ మున్నూరు కాపు సంఘం ఇన్‌చార్జి పీలం మమతా పటేల్‌, కమటం పద్మ సుజాత, పడాల మంజుల పటేల్‌, పిల్లి శ్వేతా పటేల్‌, సుంకరి నాగరాణి పటేల్‌, పడాల హారిక పటేల్‌, పర్వత నిఖిల ఉన్నారు.

ప్రైవేట్‌ ఉద్యోగ, కార్మికులకు అండగా ఉంటాం



డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ప్రైవేట్‌ ఉద్యోగ సంఘం డైరీని ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, సంఘం వ్యవస్థాపకులు గంధం రాములుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రైవేట్‌ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటామని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఐటి విభాగం రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్‌ గుప్త, మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రైవేట్‌ ఇంజనీరింగ్‌ ప్రొఫెసర్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.వై. రమేష్‌, మున్సిపల్‌ కార్మికుల విభాగం అధ్యక్షులు గ్యార శ్రీనివాస్‌, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావణి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుష్ప మన్యం, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంతరావు, అంబాల మహేష్‌ కుమార్‌ గౌడ్‌, విఠల్‌ముదిరాజ్‌, లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్‌ ముదిరాజ్‌, ఆనందరావు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల సమస్య పరిష్కారం



మిత్రహిల్స్‌వాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు తదితరులు

మోతీనగర్‌: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని మిత్రహిల్స్‌ కాలనీలో వీధిలైట్ల సమస్యను కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు పరిష్కరించారు. కాలనీలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌యంసి ఎలక్ట్రికల్‌ సిబ్బంది, కాలనీవాసులతో కలిసి ఆదివారం కార్పొరేటర్‌ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని దొంగతనాలు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెప్పటంతో ఆయన వీధి లైట్లను మార్పించారు. సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ వీధి దీపాలు సుధాకర్‌, ఎలక్ట్రికల్‌ లైన్‌మెన్‌ కాశీ తదితరులు పాల్గొన్నారు.